సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 15 । డిసెంబర్ । 2023



కిలో టమాట రూ.20

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.15 ప్రకారం ధర పలికింది.



ఊరిని మార్చిన ఊటబావులు

జిల్లాలోని తలుపుల మండలం గొల్లపల్లి గ్రామం జల సంరక్షణలో ఉమ్మడి అనంతపురం జిల్లాకే ఆదర్శంగా నిలుస్తోంది. 10లో

గరిష్ఠం/కనిష్ఠం
31.9°/13.3°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి తీవ్రత పెరిగింది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

భక్తరహళ్లి నృసింహుని ఆదాయం రూ.10.39 లక్షలు



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో హుండీ కానుకలను లెక్కించారు. 12 నెలలకు గాను రూ.10,39,577 ఆదాయం వచ్చిందని ఈఓ నాగేంద్రప్రసాద్ తెలిపారు. హుండీ లెక్కింపు అనంతరం నృసింహునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 24 నుంచి జరిగే స్వామి వారి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు, రథోత్సవ కమిటీ చైర్మన్ నాగభూషణ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే పరిహారం

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి



రైతులతో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి

నల్లమాడ: ప్రభుత్వ నిబంధనల మేరకే ముంపు బాధిత రైతులకు పరిహారం చెల్లిస్తామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి పేర్కొన్నారు. మండలంలోని ఎస్.ఎనుములవారిపల్లి సమీపంలో ప్రభుత్వం నిర్మించనున్న నల్లకొండ రిజర్వాయర్‌కు భూసేకరణలో భాగంగా గురువారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ క్షేత్రస్థాయిలో రైతులతో సమావేశం నిర్వహించారు. భూసేకరణ చట్టం 2013 ప్రకారం ఒక్కో ఎకరాకు రూ.7.50 లక్షల చొప్పున పరిహారంగా ప్రభుత్వం చెల్లిస్తుందని తెలియజేశారు. అయితే ఎకరాకు రూ.15 లక్షలు చెల్లించాలని రైతులు అధికారులను కోరారు. సమావేశంలో తహసీల్దార్ దేవేంద్రనాయక్, డిప్యూటీ తహసీల్దార్ అరుణ, రైతులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించండి

- ఎస్పీ మాధవరెడ్డి



పదవీ విరమణ పొందిన నాగరాజుకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: 'ఉద్యోగులందరికీ పదవీ విరమణ సర్వసాధారణం. విధులను అంకితాభావంతో నిర్వర్తించినప్పుడే మంచి గుర్తింపు లభిస్తుంది' అని ఎస్పీ మాధవరెడ్డి పోలీసులకు సూచించారు. హిందూపురంలో పట్టణంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన నాగరాజును జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మాధవరెడ్డి సన్మానించారు. అనంతరం జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డుల ఒక్కరోజు జీతం రూ.4,35,000 చెక్కును ఎస్పీ చేతులు మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఎస్బీ సీఐ విజయకుమార్, ఆర్ఐ రాజశేఖర్ రెడ్డి, ఏఎస్ఐ శ్రీరాములుతో పాటు హోంగార్డులు పాల్గొన్నారు.

మార్చిలోనే టెన్త్, ఇంటర్ పరీక్షలు

పుట్టపర్తి: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం 10వ తరగతి, ఇంటర్ పరీక్షలను మార్చిలోనే నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. గురువారం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అమరావతిలో పరీక్షల తేదీలను ప్రకటించారు. మార్చి 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు 10వ తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు జరుగుతాయన్నారు.

పదో తరగతి పరీక్షల షెడ్యూల్ ఇలా...

18-03-24- ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-1
19-03-24- సెకండ్ లాంగ్వేజ్
20-03-24- ఇంగ్లిష్
22-03-24- లెక్కలు
23-03-24- ఫిజికల్ సైన్సు
26-03-24- బయాలజీ,
27-03-24- సోషల్ స్టడీస్

మార్చి 15 నుంచి ఇంటర్ పరీక్షలు..

మార్చి 15వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతాయి. ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

ఛీడీపీ అంటున్నా!

''నవ్విపోదురు గాక.. మాకేటి సిగ్గు'' అన్నట్లుంది టీడీపీ నేతల తీరు. మునిగిపోయిన టీడీపీ నావను ఎలాగైనా దారిలో పెట్టాలనే ఉద్దేశంతో నీచ రాజకీయాలకు తెర లేపుతున్నారు. జనం ఏమనుకుంటే ఏంటి.. అన్నట్లుగా దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారు. ఎక్కడ ఏ చిన్న విషయం జరిగినా అధికార పార్టీకి అంటగడుతూ.. చివరికి అవన్నీ అవాస్తవాలని తేలాక నవ్వులపాలవుతున్నారు. గత కొన్ని రోజులుగా జిల్లాలో జరిగిన కొన్ని ఘటనలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా తెలుస్తుంది.

- నీచ రాజకీయాలు వీడని టీడీపీ నేతలు
- ఎన్నికలు సమీపిస్తున్న వేళ మరింత దిగజారుడు రాజకీయాలు
- ఎల్లో మీడియా తోడుగా అధికార పార్టీపై విషం
- ప్రజల నుంచి స్పందన లేక ఆక్రోశం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక 'సంక్షేమం' వెల్లివిరిసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున జరిగాయి. జరుగుతున్నాయి. ఇంటి వద్దకే పథకాలు అందుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజకీయంగానూ పెద్దపీట వేయడంతో ఆయా వర్గాల్లో ఆనందం నెలకొంది. కొన్ని రోజులుగా అధికార పార్టీ నిర్వహిస్తున్న సాధికార బస్సు యాత్రలకు బ్రహ్మరథం పడుతున్నారు.

ఓర్వలేని టీడీపీ..

సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ప్రతిపక్ష పార్టీల నాయకులు రగిలిపోతున్నారు. 'మీ బిడ్డ మంచి చేస్తేనే మళ్లీ ఆశీర్వదించండి' అంటూ ప్రజలను నమ్ముకుని ఆయన ముందుకు సాగుతుంటే.. తెలుగుదేశం పార్టీ నాయకులు మాత్రం బురదను నమ్ముకుని నీచ రాజకీయలు చేస్తున్నారు. ప్రభుత్వంపైనా, పథకాలపైనా, అధికార పార్టీ నాయకులపైనా ఏదో రకంగా బట్టకాల్చి మీద వేసిన చందంగా ప్రవర్తిస్తున్నారు. తమకు వత్తాసు పలికే ఎల్లో మీడియాలో దిగజారి అచ్చేసుకుంటున్నారు. ప్రజల్లో మరింతగా చులకన అవుతున్నారు. భార్యాభర్తలు గొడవ పడినా, అన్నదమ్ముల మధ్య వివాదం నెలకొన్నా వైఎస్సార్‌సీపీ నాయకులకు ఆపాదించి దుష్ప్రచారం చేస్తూ ప్రజలకే వెగటు పుట్టిస్తున్నారు.

ఏమైందయ్యా మీకు..

టీడీపీ నేతలు జేసీ ప్రభాకరరెడ్డి, కాల్వ శ్రీనివాసులు, పరిటాల సునీత, పయ్యావుల కేశవ్ ఇప్పటికే ప్రజల్లో చులకనైపోయారు. పార్టీలో గ్రూపు రాజకీయాలు, చంద్రబాబు స్కాములు, జైలు పాలు కావడం వంటి పరిణామాలతో జిల్లాలో పార్టీ పరిస్థితి మరింతగా దిగజారి పోయింది. ఇక.. ప్రభుత్వ పరంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతుండడంతో వారిని ప్రజలు పట్టించుకోవడం లేదు. దీంతో ఎలాగైనా ప్రజల దృష్టి మరల్చాలనే దురుద్దేశంతో పచ్చ మీడియా తోడుగా విష ప్రచారం చేస్తున్నారు.

దొంగే దొంగ అన్నట్లుగా..

- ఉరవకొండ నియోజకవర్గంలో వేలల్లో దొంగ ఓట్లు నమోదైనట్టు తేలింది. ఇవన్నీ తెలుగుదేశం పార్టీ హయాంలో ఎక్కించినవే. కానీ అధికార పార్టీపై పయ్యావుల కేశవ్ ఆరోపణలు చేసి అభాసుపాలయ్యారు.
- రాయదుర్గం నియోజకవర్గంలో శనగల వ్యాపారి ఐపీ పెడితే దాన్ని మాజీ ఎమ్మెల్యే గుర్నాథరెడ్డి కుటుంబానికి కాల్వ శ్రీనివాసులు అంటగట్టారు. దీన్ని గుర్నాథరెడ్డి సోదరుడు తీవ్రంగా ఖండించారు. ఉషశ్రీచరణ్ మంత్రి అయ్యాక తొలిసారి కళ్యాణదుర్గం వచ్చిన సందర్భంలో.. ఓ బాలింతకు దారి ఇవ్వక శిశువు మృతిచెందారని కాల్వ శ్రీనివాసులు రాద్ధాంతం చేశారు. చివరకు సీసీ ఫుటేజీల్లో చూస్తే అతన్ని ఎక్కడా ఆపిన దాఖలాలే లేవు. పార్టీకి జిల్లా అధ్యక్షులుగా ఉండి దిగజారిపోయారన్న విమర్శలున్నాయి.
- విడపనకల్లులో ఉపాధ్యాయుడు మల్లేష్ ఆర్థిక కారణాలతో ఆత్మహత్యాయత్నం చేస్తే మాజీ మంత్రి పరిటాల సునీత రాద్ధాంతం చేశారు. మల్లేష్ కుటుంబం తమను రాజకీయాలకు వాడుకోవద్దు అంటూ కాళ్లా వేళ్లా పడినా పరామర్శల పేరుతో పత్రికలకెక్కారు.
- తాడిపత్రికి చెందిన జేసీ ప్రభాకర్ రెడ్డి నోటికి అడ్డూ అదుపూ లేకుండా పోయిందన్న విమర్శలున్నాయి. సీఐ సస్పెండ్ అయినా అధికార పార్టీనే అంటారు. అభివృద్ధి పనులను అడ్డుకోవడం, కళాశాల ప్రహరీ కట్టొద్దంటూ అడ్డుకోవడం ఒకటా రెండా.. జిల్లాలో తీవ్ర వివాదాలకు జేసీ కేంద్ర బిందువుగా ఉన్నారు. ఇప్పటికే బస్సుల కొనుగోలులో ఈడీ కేసులను ఎదుర్కొంటున్న ఆయన తాను పవిత్రుడినని.. మిగతా అందరూ అవినీతి పరులని బురద జల్లుతుంటారు.

'చలి' గింతలు మొదలు



అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. 'చలి' గింతలు మొదలయ్యాయి. వేకువజామున మంచు దుప్పటి వేస్తోంది. ఈ సీజన్‌లో తొలిసారిగా చాలా ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గురువారం శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో మడకశిరలో 13.3 డిగ్రీలు, జిల్లాలోని కంబదూరులో 14.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం చలి తీవ్రత క్రమంగా అధికమవుతోంది. ఇక.. సోమందేపల్లి 14.2 డిగ్రీలు, రొద్దం 14.3 డిగ్రీలు, హిందూపురం 14.4 డిగ్రీలు, గోరంట్ల 14.6 డిగ్రీలు, శెట్టూరు, కొత్తచెరువు 15 డిగ్రీలు, కణేకల్లు, బొమ్మనహాళ్, కుందుర్పి 15.1 డిగ్రీలు, అమడగూరు, అమరాపురం, కనగానపల్లి, గార్లదిన్నె 15.2 డిగ్రీలు, పరిగి 15.3 డిగ్రీలు, బుక్కపట్నం, ఉరవకొండ, కూడేరు, నల్లమాడ, డి.హిరేహాళ్‌లో 15.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. మిగిలిన ప్రాంతాల్లో 16 నుంచి 19 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. ప్రధానంగా మడకశిర, హిందూపురం, రాయదుర్గం, కళ్యాణదుర్గం, పుట్టపర్తి, పెనుకొండ నియోజకవర్గాల్లో చలి ప్రభావం అధికంగా ఉంది. మిగతా నియోజకవర్గాల్లో కాస్త తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈనెలాఖరు నుంచి రాత్రి ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే పరిస్థితి ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

చేనేతల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మడకశిర: మాట్లాడుతున్న రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత, చిత్రంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి తదితరులు



పరిగి: ఇండియన్ డిజైన్స్ గార్మెంట్స్ పరిశ్రమలో పర్యటిస్తున్న సునీత

- సమస్యల పరిష్కారానికి కృషి
- టెక్స్‌టైల్ రంగంలో అపార అవకాశాలు
- రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత

మడకశిర: రాష్ట్రంలో చేనేత రంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత తెలిపారు. గురువారం పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో జిల్లాలోని చేనేత సొసైటీల సభ్యులు, చేనేత కార్మికులతో ఆమె సమావేశమయ్యారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. చేనేత కార్మికులు, సొసైటీల సభ్యులు తమ సమస్యలను ప్రిన్సిపల్ సెక్రటరీ సునీతకు వివరించారు. జిల్లాలోని ధర్మవరం, హిందూపురం, మడకశిర ప్రాంతాలకు చెందిన చేనేత కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి సమస్యలను చెప్పుకున్నారు. ముఖ్యంగా తమకు ముద్ర రుణాలు బ్యాంకర్లు ఇవ్వడం లేదని తెలిపారు. మరికొందరు కార్మికులు తమకు శిక్షణ ఇవ్వాలని కోరారు. శిక్షణ కావాల్సిన చేనేత కార్మికులు పేర్లు ఇవ్వాలని ప్రిన్సిపల్ సెక్రటరీ సూచించారు. సొసైటీలకు లిఫ్టింగ్ మిషన్లు ఇవ్వాలని పలువురు కోరారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కార్తీక్, డీడీ నాగేశ్వరరావు, ఉమ్మడి అనంతపురం జిల్లాల చేనేత, జౌళిశాఖ అధికారులు అప్పాజీ, రమేష్, డీఓలు రమణారెడ్డి, బసవరాజు, ఏడీ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్స్ రంగంతో ఉపాధి అవకాశాలు..

టెక్స్‌టైల్స్ రంగంలోనే ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత తెలిపారు. నైపుణ్యం కలిగిన వారికి అధిక వేతనంతో కూడిన ఉద్యోగాలు లభిస్తాయన్నారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో గురువారం పాలిటెక్నిక్ కళాశాల, వివిధ కళాశాలు, పాఠశాలల విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి అధ్యక్షత వహించగా జాయింట్ కలెక్టర్ చేతన్, సబ్ కలెక్టర్ కార్తీక్ కూడా సమావేశంలో పాల్గొన్నారు. సునీత మట్లాడుతూ టెక్స్‌టైల్ రంగంలో నైపుణ్యం కలిగిన వారు చాలా తక్కువగా ఉన్నారని తెలిపారు. టెక్స్‌టైల్ కోర్సులు పూర్తి చేసిన వారికి వెంటనే ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయన్నారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ టెక్స్‌టైల్ రంగంపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. మడకశిర పాలిటెక్నిక్ కళాశాలలో ఈకోర్సును ఎత్తివేయడానికి గతంలో ప్రయత్నాలు జరిగాయని, అయితే తాను అడ్డుపడి ఈకోర్సును కొనసాగించే విధంగా చేశాన్నారు. జాయింట్ కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాలకు టెక్స్‌టైల్స్ రంగం ఒక వరమన్నారు. ఈ రంగంలో మహిళలు అధికంగా ఉపాధి పొందుతుండటం గొప్పవిషయమని తెలిపారు. విద్యార్థులు ఉపాధి కోసం ఈరంగాన్ని ఎంచుకోవాలని కోరారు. సబ్ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ జిల్లాలోనే 15 వరకు టెక్స్‌టైల్స్ పరిశ్రమలు ఉన్నాయని తెలిపారు. నైపుణ్యం కలిగిన వారికి జిల్లాలోనే ఉపాధి అవకాశాలు దొరకుతాయన్నారు.

టెక్స్‌టైల్ కోర్సుపై అవగాహన..

మడకశిరరూరల్: మండల పరిధిలోని గుండుమలలోని ప్రభుత్వ పాలిక్నిక్ కళాశాలను గురువారం మధ్యాహ్నం రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత సందర్శించారు. సునీత మాట్లాడుతూ టెక్స్‌టైల్ రంగంపై విద్యార్థులు అవగాహన పెంచుకుని మంచి నైపుణ్యాన్ని పెంపొందించుకుని భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ కోర్సులో చేరే విధంగా గ్రామాల్లో అవగాహన కలిగించాలన్నారు. ఇప్పటికే కోర్సు పూర్తి చేసుకున్న వారు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నారని చెప్పారు.

ఉపాధి కల్పించడమే లక్ష్యం..

పరిగి: రాష్ట్ర ప్రభుత్వం చదువుకున్న యువతీ, యువకులకు తగిన ఉపాధి అవకాశాలను కల్పించడానికి కృషి చేస్తోందని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత తెలిపారు. పరిగి మండలంలోని ఇండియన్ డిజైన్స్ గార్మెంట్స్, కాలువపల్లి నిషా టెక్స్‌టైల్స్ గార్మెంట్స్ పరిశ్రమలను ఆమె గురువారం సందర్శించారు. సునీత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చేనేత, జౌళిశాఖలో ఉన్న సంక్షోభ పరిస్థితిని అధ్యయనం చేయడానికి వచ్చినట్లు తెలిపారు.

పుట్టపర్తిలో దారుణం

- దంపతుల మధ్య చిచ్చుపెట్టిన 'అనుమానం'
- అడవిలోకి తీసుకెళ్లి భార్య గొంతుకోసిన భర్త
- చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న అనిత



కత్తి దాడికి గురైన అనితను కారులోకి ఎక్కిస్తున్న బాటసారులు

పుట్టపర్తి అర్బన్: ఐదేళ్ల క్రితం పెళ్లి అయినా ఫట్టుమని పది నెలలు కూడా ఆ జంట సజావుగా కాపురం చేసింది లేదు. అనుమానం పెనుభూతంగా మారడంతో తరచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలోనే కట్టుకున్న భార్యను కడతేర్చేందుకు యత్నించాడు భర్త. పుట్టపర్తి రూరల్ ఎస్ఐ కృష్ణమూర్తి వివరాలమేరకు.... నల్లమాడ మండలం కురుమాల గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమార్తె వి.అనితను అతని అక్క కుమారుడు (వరుసకు మేనమామ) అయిన గోరంట్ల మండలం కొలిమిపల్లికి చెందిన శివమ్మ, శంకరప్ప దంపతుల కుమారుడు రామాంజనేయులుకు ఇచ్చి ఐదేళ్ల క్రితం పెళ్లి జరిపించారు. కొంత కాలం సజావుగా సాగిన వీరి సంసారంలో అనుమానం పెనుభూతంగా మారింది. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ తరచూ గొడవ పడేవారు. ఇందులో భాగంగానే గొడవ జరిగిన ప్రతిసారి అనిత పుట్టింటికి వెళ్లిపోయేది. పెద్దలు పంచాయితీ చేసి మళ్లీ భర్త దగ్గరకు పంపేవారు. ఇదే క్రమంలో 20 రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిన అనిత పెద్దల ఒప్పందం మేరకు అత్తగారింటికి వచ్చింది. అయితే మరోమారు ఇద్దరి మధ్య గొడవ జరగడంతో గురువారం ఉదయం తిరిగి పుట్టింటికి వెళ్లేందుకు అనిత సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే రామాంజినేయులే భార్య అనితను పుట్టింటికి దిగబెడతానని నమ్మించాడు. కురుమాలకు వెళ్దామని చెప్పి ద్విచక్ర వాహనాన్ని అడవి గుండా తీసుకెళ్లాడు. పుట్టపర్తి మండలం దిగువచెర్లోపల్లి గ్రామ సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతానికి రాగానే రోడ్డు పక్కకు ద్విచక్ర వాహనాన్ని నిలిపి అనితను చెట్ల చాటుకు లాక్కెళ్లి కత్తితో గొంతు కోశాడు. పెనుగులాటలో చేతులను కూడా గాయపరిచాడు. ఈ సమయంలో రోడ్డుపై వెళ్తున్న కొందరు గమనించి కేకలు వేయగానే రామాంజనేయులు బైక్‌ను అక్కడే వదిలేసి పరారయ్యాడు. రక్తపు మడుగులో ఉన్న అనితను అటువైపుగా వచ్చిన ఓ కారులో గోరంట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. బాధితురాలి పరిస్థితి విషమంగానే ఉందని, కేసు నమోదు చేసుకొని విచారణ చేపడతామని రూరల్ ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.

త్వరలో గొర్రెల పెంపకం యూనిట్లకు రుణాలు

- డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత



మాట్లాడుతున్న వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రమణారెడ్డి (చిత్రంలో) లిఖిత

అనంతపురం అగ్రికల్చర్: నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ (ఎన్ఎల్ఎం) కింద అర్హత కలిగిన లబ్దిదారులు గొర్రెల పెంపకం యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు రుణాలు అందించేలా త్వరలో విధి విధానాలు ఖరారు చేయనున్నట్లు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్ పర్సన్ ఎం.లిఖిత పేర్కొన్నారు. గురువారం స్థానిక డీసీసీబీలో జరిగిన కార్యక్రమంలో ఎన్ఎల్ఎం పథకం అమలుపై శ్రీసత్యసాయి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అవుటాల రమణారెడ్డి, పశుశాఖ అధికారులు చర్చించారు. ఎన్ఎల్ఎం పథకం కింద ఎంపికైన వారికి 50 శాతం రుణ సదుపాయం కల్పించడానికి త్వరలో ఉమ్మడి జిల్లా అధికారులతో సమావేశమై ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. సమావేశంలో నాబార్డు డీడీఎం అనురాధ, డీసీసీబీ జీఎం సురేఖా రాణి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడకూడదు

- అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెలో ఉంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలి
- మండల ప్రత్యేకాధికారులు పర్యవేక్షించాలి
- వైకేపీ, మహిళా పోలీసు, సచివాలయ సిబ్బంది విధులు నిర్వర్తించండి
- కలెక్టర్ అరుణ్‌బాబు



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు యథావిధిగా పనిచేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీసీ నిర్వహించారు. అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మె విరమించకపోతే జిల్లాలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న మహిళా సిబ్బంది విధులు నిర్వర్తించేలా ప్రత్యేక ఆదేశాలు జారీ చేస్తామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సమ్మెతో గర్భిణులు, బాలింతలు, పసిపిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీ నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. అందుకే ప్రత్యామ్నాయంగా సంబంధిత మండల అధికారులు, వైకేపీ సిబ్బంది, మహిళా పోలీసులు అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేయాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాలోని 2,824 కేంద్రాల్లో 12,482 మంది గర్భిణులు, 12,333 మంది బాలింతలు, 0-6 ఏళ్ల వయస్సు పిల్లలు 80 వేలకు పైగా ఉన్నారన్నారు. వారందరినీ కాపాడే బాధ్యత మనందిరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చేతన్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ద్వారా ఎపిక్ కార్డుల పంపిణీ

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికారులు విధులు నిర్వర్తించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో సార్వత్రిక ఎన్నికల ముందస్తు ఏర్పాట్లపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ ఎన్నికల అధికారులు, సహ ఎన్నికల అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఎస్పీ మాధవరెడ్డి, జేసీ చేతన్, డీఆర్ఓ కొండయ్య తదితరులు పాల్గొన్నారు. ఈనెల 20 లోపు అన్ని క్లెయిమ్స్ పరిష్కరించాలన్నారు. త్వరలో ఎన్నికల కమిషన్ బృందం పర్యటించనుందని ఫారం 6, 7, 8 పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎపిక్ కార్డులను పోస్టల్ డిపార్ట్‌మెంట్ ద్వారా పంపిణీ చేయాలన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులు సన్నద్ధంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్‌లో పోలీస్ అధికారులు కీలకం కానున్నారని ఎస్పీ మాధవరెడ్డి చెప్పారు. పుట్టపర్తి, కదిరి ఆర్డీఓలు భాగ్యరేఖ, వంశీకృష్ణారెడ్డి, డీఎస్పీలు, వివిధ మున్సిపాలిటీ కమిషనర్లు, నియోజకవర్గం ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి జూడో పోటీలకు ఎంపిక



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో పీడీ ప్రతాప్‌రెడ్డి

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు జాతీయస్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు పీడీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇటీవల తిరుపతిలో జరిగిన జూడో పోటీల్లో చిగిచెర్ల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. 35 కిలోల లోపు కేటగిరిలో విక్రాంత్, 32 కిలోల లోపు కేటగిరిలో యశ్వంత, 40 కిలోల లోపు కేటగిరిలో లాస్యారెడ్డి, 52 కిలోల లోపు కేటగిరిలో యశస్విణి బంగారు పతకాలు సాధించారన్నారు. ఈ నెల 15 నుంచి కేరళ రాష్ట్రంలోని ఎర్నాకులంలో జరిగే జాతీయస్థాయి సబ్ జూనియర్ జూడో పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిమ్మారెడ్డి, పీడీ ప్రతాప్‌రెడ్డి, గ్రామ పెద్దలు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

క్లుప్తంగా

'ట్రాక్టర్ నగర్'తో 'మహీంద్ర' ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ట్రాక్టర్ నగర్ డైరెక్టర్ డాక్టర్ బీఎం నాందేడ్

గార్లదిన్నె: మండల పరిధిలోని దక్షిణ వ్యవసాయ క్షేత్ర వ్యవసాయ యంత్రముల శిక్షణ, పరీక్షణ సంస్థ శిక్షణా విభాగం ఆధునీకరణలో భాగంగా మహీంద్ర లిమిటెడ్ కంపెనీతో అవగాహన ఒప్పందం కుదిరింది. వ్యవసాయ యంత్ర పరికరాలు, ఆధునిక యంత్ర పరికరాలపై విద్యార్థులకు, రైతులకు శిక్షణ పొందేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని ట్రాక్టర్ నగర్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ బాలాజీమురారీ నాందేడ్ అన్నారు. గురువారం ట్రాక్టర్ నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహీంద్ర కంపెనీ ప్రతినిధులు భరద్వాజ్, సౌమిత్ర చౌదరి, ప్రఫుల్లా పాండే హాజరై అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఒప్పందం మేరకు ట్రాక్టర్ నగర్‌లో కంపెనీ యంత్రాలను ఉంచి వాటిపై రైతులకు, టెక్నికల్ విద్యార్థులకు, కంపెనీ ఇంజనీర్లకు, శిక్షణ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు.

తల్లిదండ్రుల చెంతకు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు



తప్పిపోయిన పిల్లలతో సీఐ నారాయణరెడ్డి

కదిరి అర్బన్: ఆర్టీసీ బస్టాండ్‌లో తప్పిపోయిన ఆశ్రమ పాఠశాల విద్యార్థులను పోలీసులు గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. తమ పిల్లలు కదిరి బస్టాండ్‌లో తప్పిపోయారంటూ గాండ్లపెంట మండలం పెద్ద తండాకు చెందిన శ్రీనివాసులునాయక్, విజయకుమారి దంపతులు ఈ నెల 12న కదిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసిన సీఐ నారాయణరెడ్డి... పిల్లల ఆచూకీ పసిగట్టేందుకు ప్రత్యేక బృందాలను రంగంలో దించారు. ఈ క్రమంలోనే తిరుపతి జిల్లా రేణిగుంట రైల్వే స్టేషన్‌లో చిన్నారులు ఉన్నట్లుగా గుర్తించి, సిబ్బందిని పంపి కదిరికి పిలుచుకొచ్చేలా చేశారు. అనంతరం తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించుకుని పిల్లలను అప్పగించారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

హిందూపురం: నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు హిందూపురం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో ఈనెల 20వ తేదీ నుంచి డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు నిర్వహిస్తున్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన వారు కోర్సులో చేరేందుకు అర్హులని కళాశాల ప్రిన్సిపల్ హరీష్ బాబు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు స్కిల్‌హబ్ కో–ఆర్డినేటర్ కె.సాయి వెంకటరమణను 9492051475 నంబర్‌లో సంప్రదించాలన్నారు. లేకపోతే ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నేరుగా వచ్చి పేర్లు నమోదు చేసుకోవచ్చునని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం వెల్లడించారు.

ఊరిని మార్చిన ఊటబావులు

ఒకప్పుడు ఆ గ్రామంలో తీవ్ర కరువు పరిస్థితులు ఉండేవి. వర్షాలు బాగా కురిస్తేనే పంటలు పండేవి. లేదంటే నష్టాలు, కష్టాలే. కానీ ఇప్పుడా దిగులు లేదు. ఎటు చూసినా జలసిరులే. ఏడాది పొడవునా పచ్చని పంటలతో గ్రామం అలరారుతోంది. వ్యవసాయంలో సిరుల పంట పండుతుండడంతో గ్రామస్తులు ఆర్థికంగానూ ఎదుగుతున్నారు. పిల్లలను బాగా చదివిస్తుండడంతో వారు మంచి ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. క'న్నీటి' కష్టాలను కలసికట్టుగా జయించి ఆదర్శంగా నిలుస్తున్న ఆ గ్రామమే గొల్లపల్లి తండా.

- గొల్లపల్లి తండాలో జలసిరులు
- ఊటబావులతో వ్యవసాయం సుసంపన్నం
- 10 నుంచి 15 అడుగుల లోతులోనే భూగర్భజలాలు
- వ్యవసాయ, విద్య, ఉద్యోగపరంగా రాణిస్తున్న గ్రామస్తులు
- ఆదర్శంగా నిలుస్తున్న తండా





గొల్లపల్లి తండా వద్ద ఊటబావులో పుష్కలంగా ఉన్న నీరు

సాక్షి, అనంతపురం డెస్క్/తలుపుల:

శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలంలోని గొల్లపల్లి తండా జలసంరక్షణలో ఉమ్మడి జిల్లాకే ఆదర్శంగా నిలుస్తోంది. ఇతర ప్రాంతాల్లో బోరుబావులను నమ్ముకుని వ్యవసాయం చేస్తుండగా..ఇక్కడ మాత్రం ఊటబావులు పంటల సాగుకు ఆధారంగా ఉన్నాయి. సుమారు రెండు దశాబ్దాల క్రితం తండాలో నీటివనరులు లేక తీవ్ర కరువు పరిస్థితులు ఉండేవి. ఊటబావులు అందుబాటులోకి వచ్చాక కరువు తొలగిపోయి ..గ్రామం సస్యశ్యామలంగా మారింది.



గొల్లపల్లి తండా ముఖచిత్రం

చెక్‌డ్యాంతో మొదలై..

గొల్లపల్లి తండాలో 2003 సంవత్సరంలో రూరల్ డెవలప్‌మెంటు ట్రస్టు (ఆర్డీటీ) ఆధ్వర్యంలో తొలి చెక్‌డ్యాం నిర్మించారు. చుట్టుపక్కల పడే వర్షపునీరంతా చెక్‌డ్యాములోకి చేరేలా ఏర్పాటు చేశారు. అలాగే వర్షపునీరు భూమిలోకి ఇంకేందుకు వీలుగా కొండల అంచుల వెంబడి అటవీ శాఖ సహకారంతో కందకాలు తవ్వారు. భూగర్భ జలాలు పెరిగేందుకు ఈ చర్యలు దోహదపడ్డాయి. బోరుబావులు తవ్వితే భూగర్భజలాలు తొందరగా ఇంకిపోయే ప్రమాదం ఉంటుందన్న ఉద్దేశంతో వాటిపై నిషేధం విధించుకున్నారు. ఊటబావుల తవ్వకానికి పూనుకున్నారు. చెక్‌డ్యాం అందుబాటులోకి వచ్చిన తొలి ఏడాదే గ్రామంలో తొమ్మిది ఊటబావులు తవ్వారు. 20–30 అడుగుల్లోనే నీరు సమృద్ధిగా లభ్యమైంది.

58 ఊటబావులు.. 540 ఎకరాలు..

గ్రామ పరిసరాల్లో గతంలో 80కి పైగా ఊటబావులు ఉండేవి. వివిధ కారణాల వల్ల కొన్ని నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం 58 ఊటబావులు అందుబాటులో ఉన్నాయి. 10–15 అడుగుల లోతులోనే నీరు లభ్యమవుతోంది. బావుల కింద సుమారు 540 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. మామిడి తోటలతో పాటు వేరుశనగ, వరి, చిరుధాన్యపు పంటలు సాగవుతున్నాయి. వంద ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. ఒకరిద్దరు రైతులు తేనెటీగల పెంపకం కూడా చేపడుతున్నారు. జలసంరక్షణ, పంటల సాగు అంశాల్లో ఆర్డీటీ సహకారం కొనసాగుతోంది.

పశుసంపదకు ఆలవాలం..

గొల్లపల్లి తండాలో పశుసంపద కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో ఉంది. సుమారు 200 ఆవులు, ఆరువేల దాకా గొర్రెలు ఉన్నాయి. గ్రామస్తులు ఇటు వ్యవసాయం, అటు పశుపోషణ ద్వారా ఆర్థికంగా ఎదుగుతున్నారు. సమీపంలోనే కొండలు ఉండడం, నీటికొరత ఏమాత్రమూ లేకపోవడంతో వ్యవసాయానికి, పశుపోషణకు ఢోకా లేదని స్థానికులు చెబుతున్నారు.

గ్రామం పేరు	గొల్లపల్లి తండా
మండలం	తలుపుల
మొత్తం కుటుంబాలు	154
జనాభా	520
రైతు కుటుంబాలు	120

ఉద్యోగాల్లో సత్తా..

గ్రామంలో ఉండేది 154 కుటుంబాలు మాత్రమే. అయినప్పటికీ ఉద్యోగులకు కొదువ లేదు. ఏకంగా 68 మంది వివిధ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. వీరిలో 12 మంది డాక్టర్లు ఉండడం విశేషం. గిరిజన గ్రామమైనప్పటికీ ఈస్థాయిలో వృద్ధి సాధించిందంటే జల సంరక్షణలో చిత్తశుద్ధి, సమష్టి చైతన్య స్ఫూర్తే కారణమని స్థానికులు అంటున్నారు.

రోడ్డు నిర్మాణంతో మహర్దశ..

గొల్లపల్లి తండా ఒకప్పుడు మారుమూల గ్రామంగా ఉండేది. కానీ దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో కదిరి–పులివెందుల మధ్య నామాలగుండు మీదుగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో తండా రోడ్డు పాయింటుకు చేరింది. రవాణా సౌకర్యాలు మెరుగుపడడంతో తండావాసుల రోజువారీ కార్యకలాపాలకు ఇబ్బందులు తొలగిపోయాయి. పాల విక్రయం, వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్‌కు సులువైన 'మార్గం' ఏర్పడింది.



ఓ రైతు పొలంలో తేనెటీగల పెంపకం



గొల్లపల్లి తండా వద్ద కళకళలాడుతున్న పంటలు



సాగవుతున్న మామిడి తోట

వైఎస్సార్ ఎంతో మేలు చేశారు



గతంలో గ్రామం నుంచి 5 కిలోమీటర్లు వెళ్లి బస్సెక్కాల్సిన పరిస్థితి. వైఎస్ రాజశేఖర రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో కదిరి–పులివెందుల మధ్య నామాలగుండు మీదుగా రోడ్డు వేశారు. దీంతో తండా రోడ్డు పాయింటుకు చేరి రవాణా సౌకర్యాలు మెరుగయ్యాయి. పంట ఉత్పత్తుల విక్రయం సులువైంది. ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి వీలు కలిగింది. – శీనా నాయక్, గొల్లపల్లి తండా

సమృద్ధిగా నీరు



ఒకప్పుడు గ్రామంలో కరువు పరిస్థితులు ఉండేవి. ఇప్పుడా సమస్యే లేదు. గ్రామస్తులు సమష్టిగా తీసుకున్న చర్యలతో నేడు సమృద్ధిగా నీళ్లు లభిస్తున్నాయి. ఏడాది పొడవునా పంటలు పండిస్తున్నాం. పశుపోషణ కూడా కలిసివస్తోంది. పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నాం. అందరం కలసిమెలసి సంతోషంగా జీవిస్తున్నాం.

– మనోజ్ఞ నాయక్, గొల్లపల్లి తండా

సాగుకు ఎలాంటి ఇబ్బంది లేదు



ఊటబావులు పంటల సాగుకు ఆధారంగా ఉన్నాయి. వర్షపునీరు భూమిలోకి ఇంకేందుకు వీలుగా కొండల అంచుల వెంబడి అటవీ శాఖ సహకారంతో కందకాలు తవ్వుకున్నాం. భూగర్భజలాలు పెరిగేందుకు ఈ చర్యలు దోహదపడ్డాయి.

– గంగాధర్ నాయక్, టీచర్

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

రొళ్ల: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని అటవీశాఖ కడప ఫ్లయింగ్ స్క్వాడ్ సెక్షన్ ఆఫీసర్ నాగరాజు పేర్కొన్నారు. రొళ్ల మండలం టీడీ పల్లికి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన అటవీశాఖ ఆధ్వర్యంలో 20 హెక్టార్లలో చేపట్టిన ప్లాంటేషన్‌ను గురువారం ఆయన పరిశీలించి, మాట్లాడారు. పెనుకొండ రేంజ్ పరిధిలోని టీడీపల్లి ప్రధాన రోడ్డు పక్కన, గుడిబండ మండలం పూజారిపల్లి, గుట్టూరు వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో మూడేళ్ల క్రితం ఎన్‌టీహెచ్‌ఎస్ ప్లాంటేషన్ కింద 60 హెక్టార్లలో రూ. 58.5లక్షల ఖర్చుతో 66,660 మొక్కలు నాటినట్లు గుర్తు చేశారు. నాటిన మొక్కలను ఎండ బెట్టకుండా సక్రమంగా సంరక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కుళ్లాయప్ప, ఎఫ్‌బీఓలు వెంకటరమణప్ప, సంజీవరాయుడు, శ్రీనివాసులు, విజయభాస్కర్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

అట్టహాసంగా 'పాలిటెక్నిక్' క్రీడాపోటీలు

అనంతపురం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల క్రీడా మైదానంలో అంతర్ జిల్లాల పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జేఎన్‌టీయూ వీసీ డాక్టర్ జింకా రంగజనార్దన ముఖ్య అతిథిగా హాజరై, పోటీలను ప్రారంభించారు. గెలుపోటములను సమానంగా స్వీకరించి, క్రీడా స్ఫూర్తిని చాటాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు ఆటపాటలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆర్‌డీటీ చైర్మన్ తిప్పేస్వామి, ఆర్జేడీ నిర్మల్ కుమార్‌ప్రియ, అధ్యాపకులు హాజరయ్యారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని 15 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 442 మంది క్రీడాకారులు హాజరయ్యారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జేఎన్‌టీయూ వీసీ జింకా రంగజనార్దన

ముగ్గురికి రిమాండ్

కదిరి టౌన్: మారణాయుధాలు, నాటుసారా రవాణా కేసులో ముగ్గురు యువకులను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలను సీఐ నారాయణరెడ్డి వెల్లడించారు. బెంగళూరుకు చెందిన సైఫ్ మౌలానా, ఆసీఫ్ బాషా, కదిరిలోని మశానం పేటకు చెందిన సయ్యద్ జావేద్ బుధవారం రాత్రి కారులో అక్రమంగా పిడిబాకులు, 20 లీటర్ల నాటుసారా రవాణా చేస్తూ కదిరిలోని జీవిమాను సర్కిల్‌లో పోలీసులకు పట్టుబడ్డారు. విచారణ అనంతరం గురువారం ఉదయం నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

గుండెపోటుతో పీఈటీ మృతి



బయారెడ్డి (ఫైల్)

నల్లమాడ/ముదిగుబ్బ: మండలంలోని రెడ్డిపల్లికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు కె.బయారెడ్డి(49) గుండెపోటుతో మృతిచెందారు. ముదిగుబ్బ మండలం ఎస్.ఎనుములవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్న ఆయన గురువారం మధ్యాహ్నం 12 గంటలకు ఇంట్లో ఉండగా గుండెపోటుకు గురై కుప్పకూలారు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ప్రైవేట్ వాహనంలో నల్లమాడలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య రమాదేవి, ఇద్దరు కుమారులున్నారు. విషయం తెలుసుకున్న ఎనుములవారి పల్లి పాఠశాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఉపాధ్యాయులు సంతాపం ప్రకటించారు. కాగా, బయారెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి దిగ్భ్రాంతికి లోనయ్యారు. వెంటనే రెడ్డిపల్లికి చేరుకుని బయారెడ్డి మృతదేహాన్ని పరిశీలించి, నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ ఎస్.రామచంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె.సూర్యనారాయణ, నాయకులు ఎర్రసూరి, షరీఫ్, బాబావలి, హరినాథరెడ్డి, చక్రి తదితర నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

'ఆపస్' రాయలసీమ జోనల్ బాధ్యులుగా వెంకటేశ్వరప్రసాద్



వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) పశ్చిమ రాయలసీమ జోనల్ బాధ్యులుగా అనంతపురం నగరంలోని పొట్టి శ్రీరాములు స్కూల్‌లో ఇంగ్లిష్ టీచర్‌గా పని చేస్తున్న టి.వెంకటేశ్వరప్రసాద్, ఉమ్మడి జిల్లా పర్యటన కార్యకర్తగా బత్తలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు టీచర్‌గా పనిచేస్తున్న బి.రాజేంద్రప్రసాద్ ఎంపికయ్యారు. వీరికి సంఘం జిల్లా అధ్యక్షురాలు కళ్యాణి, ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి, కోశాధికారి రాఘవేంద్ర గుప్తా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయణస్వామి, సీనియర్ నాయకులు భాస్కరయ్య, మల్లికార్జున రెడ్డి, రాజశేఖర్, గోపీచంద్, కారుమంచి, హర్షవర్ధన్ మహిళా కన్వీనర్ మంజుశ్రీ అభినందనలు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

మడకశిర రూరల్: మండలంలోని రేకులకుంట నివాసి నరసింహమూర్తి (35) గురువారం సాయంత్రం వేప చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యసనాలకు బానిసైన ఆయన వాటి నుంచి బయటపడలేక ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు సమాచారం. ఘటనపై మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గొర్రెల మందపై దూసుకెళ్లిన స్కార్పియో



మృత్యువాత పడిన గొర్రెలు

రొళ్ల: గొర్రెల మందపై స్కార్పియో వాహనం దూసుకెళ్లడంతో 11 జీవాలు మృత్యువాతపడ్డాయి. వివరాలు... రొళ్ల మండలం కల్లురొప్పం గొల్లహట్టికి చెందిన రామప్ప వందకు పైగా గొర్రెల పెంపకం చేపట్టాడు. గురువారం ఉదయం గొర్రెలను మేపు కోసం బయలు ప్రాంతానికి తోలుకెళ్లిన ఆయన రాత్రికి మందతో ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో మడకశిర వైపు నుంచి రొళ్ల వైపు జాతీయ ప్రధాన రహదారిపై వేగంగా వచ్చిన స్కార్పియో వాహనం గొర్రెల మందపై నుంచి దూసుకెళ్లింది. 9 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో రెండు గొర్రెలు తీవ్ర గాయాలతో అర్ధరాత్రి మృత్యువాతపడ్డాయి. దీంతో రూ.1.60 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధిత యజమాని ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా, ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న రొళ్ల ఎస్‌ఐ మధురామచంద్రుడు అక్కడకు చేరుకుని పరిశీలించారు. విషయం తెలుసుకున్న అగళి ఎస్‌ఐ లావణ్య జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు చేపట్టారు. అయినా ప్రమాదానికి కారణమైన స్కార్పియో వాహనం ఆచూకీ లభ్యం కాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జనవాక్కు

పిల్లలను చదివించుకుంటున్నా



పేదరికం కారణంగా కుటుంబపోషణ భారమై మాతో పాటు కుమారుడు, కుమార్తెను కూడా పనికి పిలుచుకెళ్లేవాళ్లం. పిల్లలను చదివించలేకపోతున్నామనే బాధ ఉండేది, కానీ ఏమీ చేయలేని అసహాయ స్థితి మాది. ఇలాంటి పరిస్థితుల్లో జగనన్న ముఖ్యమంత్రి అయ్యారు. పిల్లలను బడికి పంపితే అమ్మ ఒడి పథకం కింద రూ.15వేలు ఇస్తామని ప్రకటించారు. దీంతో పిల్లలను బడికి పంపసాగాము. అమ్మ ఒడి పథకం కింద జగనన్న అందించిన సాయం మా పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తోంది. కుమారుడు ఇంటర్, కుమార్తె పదో తరగతి చదువుకుంటున్నారు. ఇతర పథకాలూ కలిసొచ్చాయి. దీంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది.

– అంజక్క, సి.కొడిగేపల్లి, మడకశిర మండలం

రుణం తీర్చుకోలేనిది



పుట్టుకతోనే నేనో మరుగుజ్జును ఏ పనీ చేయడానికి చేతకాదు. మరుగుజ్జు కింద పెన్షన్ కోసం గత ప్రభుత్వంలో అధికారులు, ప్రజాప్రతినిధులు చుట్టూ తిరిగాను. అయినా ఎవరూ కనికరించలేదు. కనీసం సరైన ధ్రువీకరణ పత్రం కూడా మంజూరు చేయలేదు. నా పరిస్థితి తెలుసుకున్న వలంటీర్ నా నుంచి 8 నెలల క్రితం దరఖాస్తు తీసుకెళ్లి సదరం సర్టిఫికెట్ వచ్చేలా చేశాడు. ఆరు నెలలుగా పింఛన్ అందుతోంది. మా అమ్మకు వితంతు పెన్షన్ కూడా మంజూరు చేశారు. ఈ ప్రభుత్వంలోనే ఇంటి స్థలం కూడా వచ్చింది. ఏ ప్రభుత్వంలోనూ ఇంత లబ్ధి పొందలేదు. సీఎం వైఎస్ జగన్ రుణం తీర్చుకోలేనిది.

– తరుణ్‌కుమార్, కుర్లపల్లి, లేపాక్షి మండలం

సొంతిల్లు నిర్మించుకున్నా



నా భర్త బేల్దారి పనులకు పోతుంటాడు. నేను ఇంటి వద్దనే బీడీలు చుడుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. సొంతిల్లు లేక అద్దె ఇంట్లోనే ఉండేవాళ్లం. వైఎస్ జగన్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మాకు కదిరి మున్సిపల్ పరిధిలోని ఎర్రగుంటపల్లి వద్ద రూ.4 లక్షలు విలువ చేసే ఇంటి స్థలం మంజూరైంది. రూ.1.80 లక్షల సాయం అందించడంతో సొంతిల్లు నిర్మించుకోగలిగాం. జగనన్న చేసిన సాయం మరువలేనిది. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం. – కలీమున్, కదిరి

ప్రాణాలు నిలబెట్టారు



కూలి పనులతో జీవనం సాగిస్తున్న నేను కొన్ని నెలలుగా కడుపునొప్పితో బాధ పడేవాడిని. ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేసి కిడ్నీ సంబంధిత వ్యాధి ఉందని, ఆపరేషన్ చేయించుకోకపోతే ప్రాణాలకే ముప్పు అన్నారు. ఆపరేషన్‌కు రూ.లక్ష వరకూ ఖర్చు వస్తుందన్నారు. చేతిలో చిల్లిగవ్వ లేదు. ఏం చేయాలో దిక్కుతోచలేదు. ఆ సమయంలో వలంటీర్ వచ్చి ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా ఆపరేషన్ చేస్తారని చెప్పారు. దీంతో అనంతపురంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లా. నయాపైసా ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేశారు. డిశ్చార్జ్ సమయంలో ఉచితంగా మందులూ ఇచ్చారు. ఇంటికి వచ్చిన తర్వాత పౌష్టికాహారం కోసం నా బ్యాంక్ ఖాతాలోకి డబ్బు చేశారు. సీఎం వైఎస్ జగన్ చొరవతోనే నా ప్రాణాలు నిలబడ్డాయి.

– ఎస్.ఉగ్రనరసింహుడు, ఎం.అగ్రహారం, తాడిమర్రి

ఆటో బోల్తా.. ఒకరి మృతి

హిందూపురం అర్బన్: ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురం నుంచి ప్రయాణికులతో రొద్దం మండలం కలిపి గ్రామానికి వెళుతున్న ఆటో గురువారం రాత్రి మోతుకుపల్లి వద్దకు చేరుకోగానే పంది అడ్డు రావడంతో అదుపు తప్పి బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న అశ్వత్థరెడ్డి (58)తో పాటు మరో ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న అశ్వత్థరెడ్డిని అంబులెన్స్‌లో బెంగళూరుకు తీసుకెళుతుండగా మృతి చెందాడు. ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి దుర్మరణం



బోల్తాపడిన టాటా ఏస్ వాహనం

పెనుకొండ రూరల్: టాటా ఏస్ వాహనం బోల్తాపడిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.... పెనుకొండ మండలం గొందిపల్లికి చెందిన యువకులు వీరనారాయణ (19), అశోక్, నరేష్... ధర్మవరం నుంచి అంగడి సరుకులను హోల్‌సేల్ ధరతో తీసుకువచ్చి పెనుకొండలో విక్రయించేవారు. ఈ క్రమంలో గురువారం అంగడి సరుకులు తీసుకువస్తుండగా 44వ జాతీయ రహదారిపై తిమ్మాపురం బ్రిడ్జి సమీపంలోకి చేరుకోగానే టాటా ఏస్ వాహనం అదుపు తప్పి ప్రొటెక్షన్ వాల్‌ను ఢీకొని దాదాపు 20 అడుగుల పల్లంలోకి పడింది. ఘటనలో వీరనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అశోక్, నరేష్‌ను అటుగా వెళుతున్న వారు గమనించి వెంటనే పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వారిని అనంతపురానికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.